ప్రజాశక్తి
బుధవారం 1 మార్చి 2023
5
శ్రీ సత్యసాయి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కేతన్‌గార్గ్

మార్చి 11న బ్యాలెట్ పేపర్ల పంపిణీ

కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీ మార్చి 11న చేపడతామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పుట్టపర్తి, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన డీఆర్వోలు, నోడల్ అధికారులతో శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, పంపిణీ అనంతపురం కలెక్టరేట్ నుంచి మార్చి 11వ తేదీ ఉదయం 9గంటల నుంచి ఆయా జిల్లాలకు పంపిణీ చేస్తామన్నారు. చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఐదు జిల్లాల నుంచి సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి అథారిటీ లెటర్లతో అధికారులను అనంతపురానికి పంపి బ్యాలెట్ పేపర్లను తగిన బందోబస్తుతో తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. ఆ తర్వాత ఆ బ్యాలెట్ పేపర్లను ఆయా జిల్లాల నుంచి పోలింగ్ స్టేషన్లకు పంపాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతలు, బందోబస్తు ఏర్పాట్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారి ఎస్పీలు కలిసి చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా వారే ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సల ప్రొక్యూర్మెంట్, ఇతర ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పనులన్నింటినీ ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు చేపట్టాలన్నారు. మండలి ఎన్నికలలో ప్రాధాన్యత క్రమాన్ని అనుసరించి ఓటింగ్ చేస్తున్న నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఏ విధంగా ఓటింగ్ చేయాలో మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మార్చి 7వ తేదీ లోపు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ స్లిప్పులు సంబంధిత ఓటర్లకు మాత్రమే బూత్ లెవెల్ అధికారులు ఇచ్చి వారి నుంచి సంతకం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మార్చి 14వ తేదీన అనంతపురంలోని జేఎన్టీయూలో రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సలను తగిన బందోబస్తుతో ఇక్కడికి చేర్చాలన్నారు. కౌంటింగ్‌పై మార్చి 15వ తేదీన శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ గాయత్రిదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్‌లు పంపిణీ

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్లకు ఓటర్ స్లిప్పులను బుధవారం నుంచి జారీ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కేతన్ గార్గ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 13వ తేదీన నిర్వహించనున్న కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్లకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. సంబంధిత విఆర్ఓ లేదా బూత్ స్థాయి అధికారుల నుంచి ఓటర్ స్లిప్స్ పొందాలని ఓటర్లకు సూచించారు.

ఎలా పట్టుకోవాలి..?



- పట్టభద్రుల ఓట్ల కోసం గాలం
- ప్రధాన పార్టీలు కసరత్తు
- ఓటుకు రెండు వేలు పెట్టాలి
- ఉపాధ్యాయులకు ఐదు వేలు...
- అంతర్గత చర్చలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మండలి ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. మంగళవారం నుంచి ప్రచారాలు ప్రారంభం అయ్యాయి. ప్రచారాల హోరు ఒకవైపు సాగుతున్న క్రమంలోనే పట్టభద్రులను ఏ రకంగా ప్రలోభ పెట్టవచ్చు అన్న దానిపైనా ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఈ మేరకు ముఖ్య నేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నాడు జిల్లాకు విచ్చేసి ముఖ్య నేతల సమావేశాలను నిర్వహించారు. ఇందులో నియోజకవర్గాల వారీగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కసరత్తు చేసినట్టు సమాచారం. ఇక టిడిపి కూడా నియోజకవర్గాల వారీగా నేతలు ఓటర్లను గుర్తించే పనిని చేపట్టారు. పట్టభద్రులకు మొత్తం 49 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు 12 మంది అభ్యర్థులు బరిలోనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి 1.30 లక్షల ఓట్లు ఉండగా, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 30 వేల ఓట్లు ఉన్నాయి. ఇందులో సగానికిపైగా ఓట్లు పోలయ్యే అవకాశముంది. వీరిని గుర్తించి వారిని ఏ రకంగా ప్రలోభ పెట్టవచ్చు... దానికయ్యే బడ్జెట్ ఎంత..? అన్నది కూడా ప్రధానపార్టీల్లో చర్చలు నడిచినట్టు సమాచారం.

పట్టభద్రులకు రెండు వేలు... ఉపాధ్యాయులకు ఐదు వేలు ...

పట్టభద్రులకు సంబంధించి ఓటుకు రెండు వేల రూపాయల చొప్పున ఇవ్వాలన్నదే సోమవారం జరిగిన ఒక ప్రధాన పార్టీ అంతర్గత చర్చల్లో వచ్చినట్టు సమాచారం. పార్టీ నుంచి ఇవ్వబోమని, అభ్యర్థే ఈ ఖర్చును పెట్టుకోవాల్సి ఉంటుందన్న చర్చ కూడా వచ్చినట్టు తెలుస్తోంది. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గానికి వచ్చే సరికి ఓటుకు రూ.ఐదు వేల వరకు అయినా ఇవ్వాలని ముఖ్య నేతలు సూచనలు చేసినట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీన్ని ఏ రకంగా పంపిణీ చేయాలన్న దానిపైనా కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఇప్పటికే ట్రయిల్ రన్‌గా టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. ఇది ఉపాధ్యాయుల్లోనున్న వ్యతిరేకతను అంచనా వేయడంలో భాగంగా అధికారపార్టీ ఒక అంచనా వేసినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి ఈసారి ప్రయివేటు ఉపాధ్యాయుల సంఖ్య ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా ఓట్లు ఉన్నాయి. వీటిని ఏ రకంగా పట్టుకోవాలి, వాటిని తమవైపు మలుచుకునేందుకు అవసరమైన ఎత్తులు వేస్తున్నారు. తక్కువ ఓట్లు కావడంతో డబ్బులను పెద్దఎత్తున పంపిణీకి సిద్ధపడుతున్నట్టు ప్రచారం సాగుతోంది.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పకడ్బందీగా పోలింగ్‌ను నిర్వహించాలి

ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదు

కలెక్టర్ పి.బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి శిక్షణ పొందాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామం హాలులో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై నిర్వహించిన మొదటి శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా, ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పట్టభద్రలకు సంబంధించి 54 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు సంబంధించి 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లచే సందేహాలను నివత్తి చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్, ఇతర పోలింగ్ మెటీరియల్‌తో పాటు సదరు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన పొంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు వచ్చిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిఆర్ఓ కొండయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ అకౌంటును పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి డివిజన్లకు సంబంధించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత్రికేయులపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

పుట్టపర్తి అర్బన్ : కదిరి పట్టణంలో టిడిపి, వైసీపీ శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు అయ్యన్న గారి శ్రీనివాసులు, సంతోష్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులపై ఇటీవల దాడులు అధికమయ్యాయని అన్నారు. కదిరిలో పాత్రికేయులపై దాడికి పాల్పడిన సిఐ మధును బాధ్యతల నుంచి తప్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐపై తగిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఓబులదేవర చెరువు : పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఓడి చెరువు మండల పాత్రికేయులు స్థానిక తహశీల్దార్ శ్రీధర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి పట్టణంలో మూడు రోజుల క్రితం సిఐ ఇంటి వద్ద టిడిపి శ్రేణులు చేసిన ఆందోళన కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను సిఐ మధు నానా దుర్భాషలాడుతూ దాడి చేయాలని పోలీసులకు ఉసిగొలిపారని విమర్శించారు. ఈ ఘటనలో రిపోర్టర్లపై కదిరి సిఐ తమ్మిశెట్టి మధు రివర్స్ కేసులు పెట్టారని విమర్శించారు. , స్థానిక రిపోర్టర్లు షబ్బీర్, సోమశేఖర్, రాము, బాబ్జాన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. ఘటనకు కారణమైన కదిరి సిఐ మధు పై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా విధి నిర్వహణలో భాగంగా న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన రిపోర్టర్ల పై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. అక్రమ కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చంద్రశేఖర్ రెడ్డి, షాజహాన్, రంగప్ప, రంగారెడ్డి, ఫిరోజ్, ఫయాజ్ , గోపినాథ్ రెడ్డి, మౌలా లి, ఆనంద్, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా సిపిఎం ప్రచారం

ప్రచారంలో పాల్గొన్న నాయకులు

పుట్టపర్తి రూరల్ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా సిపిఎం, సిఐటియు నాయకులు మంగళవారం పరామర్శించారు. పుట్టపర్తి పట్టణ కేంద్రంలోనూ మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంతియాజ్ ఎస్ వెంకటేష్, రామకృష్ణ, సాంబయ్య, పైపల్లి గంగాద్రి, నరసింహులు తదితరులు పట్టణంలోని పలు కార్యాలయాలు, పట్టభద్రులను కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుని అదేవిధంగా టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద జిల్లా కార్యాలయాలు, మామిళ్లకుంట క్రాస్ వద్ద కళాశాల, జగరాజు పల్లి మంగళకర విద్యాసంస్థలలో ప్రచారం నిర్వహించారు.

పెనుకొండ : పిడిఎఫ్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు ,కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని యు టి ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణ స్వామి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ప్రచారం : పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహ రెడ్డి కి మద్దతుగా మంగళవారం ఎన్నికల ప్రచారం ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, వజ్రం నాగప్ప, మహబూబ్ బాషా, మూర్తి, రెడ్డప్పరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేలకోట్లు కేటాయించాలి

ధర్మవరం టౌన్ : 2023-24రాష్ట్ర బడ్జెట్లో చేనేతరంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతోపాటు చేనేత సంఘం నాయకులు నాగేంద్ర, శ్రీరాములు,నాగేంద్ర, మారుతి, వెంకటేశులు తదితరులు మంగళవారం ఆర్డీవో కార్యాలయ అధికారిణికి చేనేత సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోలా రామాంజినేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 2లక్షల మంది చేనేత కార్మికులున్నారన్నారు. దీనిపై ఆధారపడి ఉపవృత్తుల వారు మరో2లక్షల మంది ఉన్నారని, అలాంటి చేనేత పరిశ్రమ కేంద్ర బడ్జెట్ కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వమైన బడ్జెట్ లో రూ.2 వేలు కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 11రకాల రిజర్వేషన్ చట్టం ఖచ్చితంగా అమలు జరపాలని డిమాండ్ చేశారు. మార్చి 15వతేదీనుండి 30వ తేదీ వరకు చేనేత కేంద్రాలలో పర్యటించి చేనేత స్థితిగతులను అధ్యయనం చేసి వాటిపై ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

నిరసనలో పాల్గొన్న రైతులు

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండల పరిధిలోని దొరిగల్లు గ్రామ రైతులు ముదిగుబ్బ సబ్ స్టేషన్‌ను మంగళవారం ముట్టడించారు.కార్యాలయానికి తలుపులు వేసి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాకాలంలో అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయామని ఈ రబీ సీజన్లో అయినా పంటలు పండిద్దామంటే విద్యుత్ సమస్యలు అధికమయ్యాయని వాపోయారు. లో వోల్టేజ్, మరమ్మతులు, సాంకేతిక లోపాలు అంటూ విద్యుత్ అధికారులు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వోల్టేజ్ సమస్య వల్లే తరచూ స్టార్టర్లు, మోటర్లు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ చేశారు. ఈ విషయంపై కదిరి ఈస్ట్ ఎడి ఆనంద్ మాట్లాడుతూ ఓవర్ లోడ్ సమస్యలు తలెత్తుతున్నాయని లోడ్ డైవర్ట్ పద్ధతి ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.

‘రైతు భరోసా’ అందజేత

జిల్లా వ్యాప్తంగా 2.68 లక్షల మందికి లబ్ధి

పిఎం కిసాన్, రైతు భరోసా మెగా చెక్కును అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా రైతులకు రైతు భరోసా, పిఎం కిసాన్ సాయాన్ని అందజేశారు. మంగళవారం నాడు పుట్టపర్తి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో 2022-23 ఏడాదికి సంబంధించి రైతు భరోసా - పిఎం కిసాన్ మూడవ విడత నగదు పంపిణీ, 2022 డిసెంబర్‌లో మాండోస్ తుపాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో రైతు భరోసా - పిఎం కిసాన్ కింద అర్హులైన 2,68,947 మంది రైతులకు రూ.56.54 కోట్ల మెగాచెక్‌ను జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, తదితరులు రైతులకు పంపిణీ చేశారు. డిసెంబర్ 2022లో మాండోస్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన 226 మంది రైతులకు రూ.19.37 లక్షల చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు సాగు ఖర్చు కింద పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో అర్హులైన ప్రతి రైతు కుటుంబానికీ ప్రభుత్వం సాయం అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సిరికల్చర్ జెడి పద్మమ్మ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీఆర్సీ డిడి రామనాయక్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

‘పల్లె’ పై ఆరోపణలు తగదు

టిడిపి వడ్డెర సంఘం నాయకులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మాజీ మంత్రి, వివాద రహితుడైన పల్లె రఘునాథ రెడ్డిపై ఇద్దరు, ముగ్గురు వడ్డెర నాయకులు వైసిపి పార్టీతో కుమ్మక్కు అయ్యి లేనిపోని ఆరోపణలు చేయడం తగదని టిడిపి వడ్డెర సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యసాయి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి వల్లేపు సోము, వడ్డెర సాధికార సమితి జిల్లా అధ్యక్షులు పల్లపు రవీంద్ర తదితరులు మాట్లాడుతూ పల్లె రఘునాథరెడ్డి కులాలు, మతాలకు అతీతంగా అందరికీ సేవ చేస్తున్నారని చెప్పారు. వడ్డెర్ల పట్ల మంచి అభిమానం కలిగిన వ్యక్తి కాబట్టే అమడగూరు మండలం ఎంపిపి పదవి బిసి జనరల్‌కు వచ్చినా, వడ్డెర సామాజికర్గానికి చెందిన వెంకట రమణమ్మకు ఆ పదవిని కేటాయించారని గుర్తుచేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలో వీలున్న చోటల్లా ఎంపిటిసి, సర్పంచ్ పదవులు కేటాయించారని తెలిపారు. వడ్డెర కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గంలో రుణాలు ఇప్పించారన్నారు. అలాంటి వ్యక్తి వడ్డెర్లను చులకనగా మాట్లాడారని నిరాధార ఆరోపణ చేయడం సరికాదన్నారు. ఒక డీఎస్పీ స్థాయి వ్యక్తి నియమ నిబంధనలు ఉల్లంఘించి రాజకీయ విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సిపికి సహాయం చేయాలనే ఆలోచన ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వెళ్లాలని సూచించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ధీటుగా బదులిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షులు వల్లిపి శ్రీనివాసులు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి నరసింహులు, పీట్ల సుధాకర్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో అక్రమ కట్టడాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌కు సిపిఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో అనేక చోట్ల అక్రమ కట్టడాలు చేపడుతున్నారన్నారు. పురాతన బావులు పూడ్చి డ్రైనేజ్ పైన ప్రహరీలు నిర్మిస్తున్న వారిపైయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, తిప్పన్న, సిఐటియ మండల కార్యదర్శి బాబావలి, నాయకులు వజ్రం నాగప్ప , మహబూబ్ బాషా, రెడ్డప్పరెడ్డి, మూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు .

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఇస్తిమా ఏర్పాట్లు పరిశీలన

కదిరి అర్బన్ : రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్ల పల్లి పంచాయతీలో 3వ తేదీ నుండి నిర్వహించే ఇస్తిమా ఏర్పాట్లను ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్తమాకు విచ్చేయు ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్ల చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బత్తలపల్లి ఎంపిపిగా గజ్జల వెంగళరెడ్డి

బత్తలపల్లి : బత్తలపల్లి ఎంపిపిగా దంపెట్ల ఎంపిటిసి గజ్జల వెంగళరెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సాయి మనోహర్ వెంగళరెడ్డిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయి మనోహర్ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఎంపీపీ గుర్రం వనజ శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ వెంగళరెడ్డికి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఎపి కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా నూతన ఎంపీపీ పాటుపడాలని కోరారు. ఎంపీపీ వెంగళరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకారంతోపాటు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రాం రెడ్డి సహాయ సహకారాలతో మండల అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచులు చల్ల కరుణాకర్ నాయుడు, అక్కిం దామోదర్, చెన్నారెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిన్నగంధం ఉత్సవాలు

బత్తలపల్లి : బత్తలపల్లిలో రెండు రోజుల పాటు హజరత్ హిమామ్ భాశీం చారిటబుల్ ట్రస్ట్, ముక్తుమ్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహించిన భాశీంస్వామి చిన్న గంధం ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. వంద మంది ఫకీర్లతో సోమవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన బీజాపూర్, కంప్లీ డ్రమ్స్ షా బన్వాష్ జలాల్ అర్ధరాత్రి వరకు నిర్వహించారు. బత్తలపల్లి ఎస్ఐ టీవీ శ్రీహర్ష తమ సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కంపూడి సత్యనారాయణ, వెంకటేశ్వర చౌదరి, ట్రస్ట్ చైర్మన్ ముక్తుమ్ బాశీం, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ గృహాలకు బిల్లులు మంజూరు

గాండ్లపెంట : మండల పరిధిలోని కల్లుబాయి తండాకు చెందిన ఆర్డీటీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేశామని ఎటిఎల్ కృష్ణ తెలిపారు. రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధు. సిఒలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

గాండ్లపెంట : మండల పరిధిలోని కొట్లపల్లికి చెందిన. డీలర్ ఏ నాగిరెడ్డి (60) గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మంగళవారం కొట్లపల్లిలోని మృతుడు నాగిరెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, స్టాక్ పాయింట్ అధికారి బాబురావు, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు శివ రంగ వరప్రసాద్ బాబు, సి సంజీవరెడ్డి. ఎన్పి కుంట డీలర్ల అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

బుక్కపట్నం : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అన్ని విధాల అభివద్ధి చెందుతుందని టిడిపి మండల కన్వీనర్ మల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో టిడిపి నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్ర పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రతి కార్యకర్త టిడిపికి పూర్వవైభవం తీసుకురావటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాయగూరల చంద్ర, నియోజవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, సయ్యద్ బాషా, ఈశ్వరయ్య, కేశవ నాయుడు, వెంకటరాముడు, తెలుగు యువత సుధీర్, సతీష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు..

టైలర్స్ దినోత్సవం

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఆనంద్ టైలర్స్ దుకాణంలో మంగళవారం అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల టైలర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టైలర్లు విశాలమ్మ, మహాలక్ష్మి, ఉషా కిరణ్, టైలర్లు పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన డివైడర్‌ను తొలగించాలని వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా నాయకులు పెద్దన్న మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డివైడర్‌ను తొలగించాలని పోలీసు, రెవెన్యూ అధికారులను కోరామన్నారు. అయినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల లోపు తగిన చర్యలు తీసుకుంటామని సంబందిత అధికారులు హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమయ్య, వెంకటేష్ , రంగప్ప, మాబు, కొండా వెంకటేశులు, శీలా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కదిరి సిఐపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కదిరి పట్టణంలో మూడు రోజుల క్రితం టీడీపీ మహిళలపై లాఠీచార్జీ చేసిన కదిరి సిఐ మధును తక్షణమే సస్పెండ్ చేయాలని టీడీపీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు ముస్తాక్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కదిరిలో ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న పర్వీన్ భానును మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు సత్యసాయి జిల్లామైనార్టీ ప్రధానకార్యదర్శి నాగూర్‌ఉస్సేన్, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు అత్తర్ రహీం, మైనార్టీనాయకులు రాళ్లపల్లి షరీప్, రావులచెరువు కుళ్లాయప్ప, ముదిగుబ్బ రెడ్డిబాష, రెడ్డప్ప తదితరులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ తదితరులు ఉన్నారు.

పర్వీన్‌భానును పరామర్శిస్తున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-హిందూపురం

పర్యావరణ పరిరక్షణ మనందరి భాధ్యత అని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆటోనగర్ సమీపంలో ఓ బావిలో ఉన్న వ్యర్థాలను పోలీస్, ఫైర్ అధికారుల సహకారంతో కాల్చివశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతు ఆటోనగర్ చుట్టుపక్కల తీవ్ర వాసన వస్తున్నట్లు చుట్టు పక్కల వారు గ్యాస్ లీకేజి వాసన వస్తున్నట్లు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో మున్సిపల్ సిబ్బందితో వివిధ ప్రాంతాలను పరిశీలన చేశామన్నారు. సమస్యను కాలుష్య మండలి ఇంజనీరింగ్ అధికారులకు వివరించామన్నారు. ఆ శాఖకు సంబందించిన నిపుణులు ప్రత్యేక పరికరంతో పరిశీలన చేసి ఆటోనగర్ సమీపంలో సుమారు 40 అడుగుల బావిలో ఉన్న వ్యర్థాల నుంచి దుర్వాసన వస్తున్నట్లు గ్రహించారన్నారు. పోలీస్, ఫైర్ అధికారులకు సమచారం అందించి ఆ బావిలో నుంచి వస్తున్న పొగను ఆర్పి, బావిని పూడ్చివేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఫైర్ అధికారులతో పాటు మున్సిపల్ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు ప్రారంభించాలని వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

పుట్టపర్తి రూరల్: జిల్లాలోని నల్లమాడ మండలంలో హంద్రీనీవా కాలువ ద్వారా ఎనమలవారి పల్లి వద్ద నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్ పనులు త్వరగా చేపట్టాలని నల్లమాడ మండల రైతులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు మంగళవారం సమర్పించారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు నాయకులు ఒకరిద్దరు రైతులతో తమకు నష్టపరిహారం చెల్లించకనే రిజర్వాయర్ పనులు మొదలు పెడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు ఇప్పించిన సంఘటనపై నల్లమాడ మండలానికి చెందిన రైతులు స్పందించారు. మంగళవారం వ్యవసాయ సలహా మండల అధ్యక్షులతో కలిసి పెద్ద ఎత్తున కార్యాలయానికి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించి,రిజర్వాయర్ త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో నియంత పాలన : బికె

ప్రజాశక్తి గోరంట్ల

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి విమర్శించారు. మంగళవారం పట్టణంలో మండల కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పార్థసారధి మాట్లాడుతూ అవినీతిని ప్రశ్నించే వారి పైన అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. రాబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులు ఐక్యతగా పార్టీకి పూర్వవైభవం తీసుకురావటానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణ భూకబ్జాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జిల్లా కార్యదర్శి వేణు రాయల్, ఉపాధ్యక్షులు జయరాం, గిరిధర్ గౌడ్, రంగయ్య, మాజీ సర్పంచి అమీబాయి, సర్పంచి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న బికె. పార్థసారధి

సచివాలయం ముందు ఉన్న హోర్డింగ్‌కు పేపర్లు అతికించిన అధికారులు

హోర్డింగ్, విగ్రహానికి ముసుగులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కనగాన పల్లి

మండలంలో అధికారులు ఎట్టకేలకు ఎన్నికల నిబంధనలను అమలు చేశారు. మండలంలో కనిపించని ఎన్నికల కోడ్ అనే శీర్షికన 27న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు మండలంలోని భానుకోట పంచాయతీ అధికారులు మంగళవారం స్పందించారు. బానుకోట సచివాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ పథకాల హోర్డింగ్‌కు, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ముసుగులు తొడిగారు.

యాదవ హక్కుల పోరాట సంఘం అధ్యక్షులుగా శివకుమార్

ఓబుల దేవర చెరువు : సత్య సాయి జిల్లా యాదవ హక్కుల పోరాట సంఘం అధ్యక్షులుగా మొరంపల్లి శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు యాదవ హక్కులపోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయ్యన్న యాదవ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

విద్యుత్ షాక్‌తో గాయపడిన యువకుడు మృతి

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం సున్నపుగుట్ట తండాకు చెందిన రహంతుల్లా నాయక్ విద్యుత్‌షాక్‌కు గురై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎగువపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ కు గురై తీవ్ర గాయాల పాలైన రహంతుల్లా నాయక్‌ను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు మృతుని బంధువులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఓబుళదేవరచెరువు : మండలం పరిధిలోని డబురువారిపల్లె మాజీ సర్పంచ్ బత్తినపల్లెకు చెందిన నారాయణ రెడ్డి (92) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీదర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అదే విధంగా చింతమానుపల్లి పంచాయితీ మల్లోళ్ళపల్లెకు చెందిన చింతా చెన్నారెడ్డి (85) అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం సున్నపుగుట్టతండాకు చెందిన రహంతుల్లాహ్ నాయక్ విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టులపై అక్రమ కేసులు దుర్మార్గం

కదిరి టౌన్ : జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎత్తిచూపే జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం సమంజసం కాదన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

పెనుకొండ : పట్టణంలోని ఎగువగడ్డ రెడ్డివారి వేపమాను వీధిలో మంగళవారం చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణపప, పట్టణ అధ్యక్షులు రవిశంకర్, కురుబ కృష్ణమూర్తి, కన్నా స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలన : టిడిపి

ధర్మవరం టౌన్ : వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కేశవనగర్‌లో మంగళవారం టిడిపి నాయకులు ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి వైసిపి చేపట్టిన ప్రజావ్యతిరేక కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వడ్డెర సాధికారసమితి జిల్లా అధ్యక్షులు పల్లపురవీంద్ర, 7వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి పల్లపు శివశంకర్, నాయకులు గరుగు వెంగప్ప, కరెంటు ఆది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు

కదిరి అర్బన్ : పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ నందు ఖాజి మన్నాన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ సామూహిక వివాహ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమలంఒ డిప్యూటీ చైర్మన్ మయానా జక్రియా ఖానూమ్ , శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్ధారెడ్డి , వైసిపి నాయకులు వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన మన్నాన్‌ను అభినందించారు. నూతన దంపతులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి : సిఐ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని టూటౌన్ సర్కిల్ పరిధిలో ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని టూటౌన్ సిఐ రాజ హెచ్చరించారు. స్థానిక కొత్తపేట సర్కిల్లో ఆటో డ్రైవర్లకు, ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎవరైనా గుట్కా అమ్మినా, మట్కా ఆడిన, అక్రమ మద్యం తరలించిన, విక్రయించిన, గంజాయి తదితర అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. మొదటి వార్డు గూడెడ్ కొట్టాలలో కూడా అందరు ప్రశాంతంగా జీవించాలని, ఎవరైనా అనవసరంగా గొడవలకు, ఫ్యాక్షన్ జోలికి వెళ్లితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పలు కళాశాల, పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సత్యకృపమహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డోలాపెద్దిరెడ్డి, అధ్యాపకులు మేరీ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీసాయి డిగ్రీకళాశాల,కాకతీయ విద్యానికేతన్, కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

బత్తలపల్లి : మానవాళి అభివృద్ధిలో సైన్స్ పాత్ర ప్రధానమైనదని ఎంఇఒ చాముండేశ్వరి అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీజ్యోతి హైస్కూల్ నందు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సైన్సు ప్రాజెక్టులతో, నమూనాలతో పాటు ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు మల్లేసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో మంగళవారం సైన్సు దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు రూపొందించిన సైన్సు ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. విద్యార్థులు 34 ప్రాజెక్టులను తయారుచేసి వివరించారు. వీటిని జగరాజు పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అధ్యాపకులు తిలకించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

బుక్కపట్నం : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని ఎస్ఎస్ఎ అకడమిక్ మానిటింగ్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి , ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య తెలిపారు. జాతీయ విజ్ఞాన దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు వెళ్తూ సైన్స్ యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వెంకటేశ్వర ప్రసాద్, ఆదినారాయణ, ఓబయ్య దస్తగిరి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని కేఎల్ఎన్ ఇన్స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను డైరెక్టర్ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాయత్రి ,తులసి, ఉష, రేష్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా అంతర్జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు రూపొందించిన పలు రకాల సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. కొడిగేనహళ్లి ఏపీఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు 150 నమూనాలకు పైగా ప్రదర్శించారు. అదేవిధంగా నరసాపురం పాఠశాలలో ఆర్డీటీ ప్రతినిధులు విద్యార్థులకు రూ.35వేలు విలువ చేసే విజ్ఞాన పరికరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదర్శ కుమార్‌కు అందజేశారు. అదేవిధంగా అమర్ విద్యా మందిర్ పాఠశాలలో విద్యార్థుల రూపొందించిన సైన్స్ విజ్ఞాన పరికరాలు ఆకట్టుకున్నాయి.

హిందూపురం : పట్టణంలో వివిధ పాఠశాల, కళాశాలల్లో సైన్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నారాయణ ఈ టెక్నో పాఠశాలల్లో టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లు, నారాయణ పాఠశాలలో ఎంఇఒ గంగప్పకిరికెర వద్ద ఉన్నా ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్ సెక్రెటరి బాలసుందరం సైన్స్‌డేను ప్రారంభించారు. అదే విధంగా బిట్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో, బాలికల కళాశాలతో వివిధ పాఠశాలల్లో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, వైస్ ప్రిన్సిపల్ తిరుమలమ్మ, అధ్యాపకులు వెంకటేశులు, సరస్వతమ్మ, శ్రీలక్ష్మి, యశోద దేవి, యశోద రాణి, పార్వతి, శ్రీధర్, సుబ్బరాయుడు, పోలయ్య, నారాయణ పాఠశాల ఎజిఎం రమేష్ బాబు, ఎఒ ముత్యాలన్న, ప్రిన్సిపల్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ శిల్పారాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈనెల 27.28వ తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో జరిగిన విజ్ఞాన ప్రదర్శన పోటీల్లో సత్యసాయి జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి బహుమతిని సాధించారు. చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లక్ష్మీనరసింహ ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ విద్యార్థిని, గ్రేట్ టీచర్ జయశంకర్‌ను డీఈవో మీనాక్షమ్మ అభినందించారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని పి వి ఎస్ పాఠశాలలో మంగళవారం నాడు సైన్స్ దినోత్సవం అని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్మన్ పి వి ఎస్ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పెనుకొండ : పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలలలో మంగళవారం ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల కరస్పాండెంట్ యు.శ్రీనివాసులు , ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి, డైరెక్టర్లు సృజన, సాయి శ్రీధర్ తదితరులు విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. అదే విధంగా స్థానిక శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ సైన్సు ఉనోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఒ కేశవయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, క్రీస్తు జ్యోతి ప్రైవేట్ పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఖాదర్ వలీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : విద్యార్థినులు విద్యతో పాటు వివిధ వ్యాపారా రంగాల్లోని మెళుకువలు నేర్చుకోవాలని ఎస్ఎస్‌పిఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి సూచించారు. మంగళవారం మహిళా డిగ్రి కళాశాలలో ట్రేడ్‌ఫేర్-2023ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు స్వయంగా సిద్ధం చేసిన మార్కెట్ స్టాల్స్, తినుబండారాలు, హ్యాండిక్రాఫ్ట్ ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తులు, జ్యువెలరీ, కూల్ డ్రింక్స్, పండ్లు అమ్మకానికి ప్రదర్శించారు. వీటిని ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తిరుమలమ్మ, అధ్యాపకులు వెంకటేశులు, సరస్వతమ్మ, శ్రీలక్ష్మి, యశోద దేవి, యశోద రాణి, పార్వతి, శ్రీధర్, సుబ్బరాయుడు, పోలయ్య, రామన్న, ఆశ్వర్థప్ప తదితర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థినులు

IN THE COURT OF TIND ADDL DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI
IA.NO. 119/2023 IN M.V.O.P. NO. 86/2017
Boya Shanthamma @ Pallepati Shanthamma. ...Petitioner
VS
Boya Hanumanna and 2 Others. ...Respondents
NOTICE TO THE RESPONDENTNO.2.
To
Respondent No.2,
Talari Venkatakrishna S/O T.P. Kullayappa, Aged about 46 Years, Owner of lorry bearing No. AP 02 X 6255, H. No.1-601-4, Nadhyal Road, Tadipatri town, Anatapuram Dist.
Whereas the above named petitioner filed petition Under Order 16 Rule 17 of C.P.C. to add you as one of the party in the above case. Hence you are hereby required to appear before this court on 14.03.2023 at 10.30 AM in person or through an advocate and answer the said claim petition, Otherwise the matter will be decided exparte.
(By Court Order)
V.Lakshmaiah,
B. Com. B.L., Advocate,
H.No. 1/2856-16-8,
Sai Ganesh colony, Revenue ward No.1
Yemmiganur-518 360. Kurnool Dist. A.P..

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి
O.S.No.59/2022
Between:
1.అల్లుగుండు సుదర్శన్‌రెడ్డి 2.అల్లుగుండు క్రిష్టారెడ్డి
3.పూల లక్ష్మీనరసమ్మ 4.పూల లక్ష్మీదేవి R/o అల్లుగుండు నల్లచెరువు మం॥ ...వాదులు
మరియు
1.ముక్తపురం సీతమ్మ మరియు 7 మంది ...ప్రతివాదులు
2.ముక్తపురం మధుసూదన్‌రెడ్డి S/o ఎం.వెంకటశివారెడ్డి-2వ ప్రతివాది.
3.ముక్తపురం శ్రీనివాసులరెడ్డి S/o ఎం.వెంకటశివారెడ్డి-3వ ప్రతివాది.
4.ముక్తపురం శశికుమార్‌రెడ్డి S/o ఎం.వెంకటశివారెడ్డి 2 to 4 R/o కొలేపల్లి, కదిరి మం॥. -4వ ప్రతివాది.
5.పి.పద్మావతమ్మ W/o పి.గోవిందరెడ్డి, 6వ ప్రతివాది, R/o మొటుకుపల్లి, కదిరి మం॥ ...ప్రతివాదులు 2,3,4,6
ఇందుమూలముగా ప్రతివాదులు అయిన మీకు తెలియజేయడం ఏమనగా వాదులు అయిన అల్లుగుండు సుదర్శన్‌రెడ్డి మరియు ఇతరులు భాగ పరిష్కార విషయమై మీ అందరిపైన పై కోర్టు నందు దావా వేసియున్నారు. పై దావా వాయిదా 02-03-2023వ తేదీన మీ హాజరు నిమిత్తము అయి వున్నది. ప్రతివాదులు అయిన 2,3,4,6 పై కోర్టు నందు ఉ॥10.30 గం॥లకు హాజరుకావలెను. అట్లు హాజరుకాని యెడల మీ పరోక్షమున కోర్టువారు నిర్ణయము తీసుకొందును.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:02-03-2023.
ఎస్.శివశంకర్‌రెడ్డి
వాదులతరఫున వకీలు, కదిరి.